శ్రీ పన్నగాద్రివర శిఖరాగ్ర వాసునకు పాపాంధకార ఘన భాస్కరునకు

ఆ పరాత్మునకు నిత్యానపాయినియైన మా పాలి అలమేలు మంగమ్మకు

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

శరణన్న దాసులకు వరమిత్తునని బిరుదు ధరియించియున్న పర దైవమునకు

మరువవలదీ బిరుదు నిరతమని పతిని ఏమరనియ్య నలమేలు మంగమ్మకు

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

ఆనంద నిలయమం దనిశంబు వసియించి దీనులను రక్షించు దేవునకును

కానుకల నొనగూర్చి ఘనముగా విభుని సన్మానించు అలమేలు మంగమ్మకు

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

పరమొసగ నా వంతు నరులకని వైకుంఠమరచేత చూపు జగదాత్మునకును

సిరులొసగ తనవంతు సిద్ధమని నాయకుని ఉరముపై కొలువున్న శరధి సుతకు

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

తెలివితో ముడుపులిటు తెమ్ము తెమ్మని పరుషనలికించి గైకొనెడి అచ్యుతునకు

ఎలమి పాకంబు జేయించి అందరకన్న మలయకెపుడొసగె మహామాతకు

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

మరియు చిత్ర విచిత్ర మంటపావలులకును తిరువీధులకు దివ్య తీర్థములకు

పరగ ఘన గోపుర ప్రాకారతతులకును చిరములైతగు కనక శిఖరములకు

తరచైన ధర్మసత్రములకును ఫలపుష్పభరిత శృంగార వన పంక్తులకును

మురువొప్ప ఉగ్రాణములకు బొక్కసములకు సరసంబులగు పాకశాలలకును


www.telugulyrics.org

అహి వైరి ముఖ్య వాహనములకు గొడుగులకు రహినొప్పు మకర తోరణములకును

బహువిధం ధ్వజములకు పటు వాద్య వితతులకు విహిత సత్కల్యాణవేదికలకు

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

ధర చక్ర ముఖ్య సాధనములకు మణిమయాభరణ దివ్యాంబర ప్రతతులకును

కర చరణ ముఖ్యాంగ ఘన సహితమై శుభాకరమైన దివ్య మంగళ మూర్తికీ

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

కలిత సుజ్ఞ్యానాది కళ్యాణ గుణములకు బలమొప్పనవి తాత్ప్రభావమునకు

బలగొనిన సకల పరివార దేవతలకును చెలగి పనులొనరించు సేవకులకు

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

అలరగా బ్రహ్మోత్సవాదులై సంతతము వలనొప్పు నిత్యోత్సవంబులకును

పొలుపొందు విశ్వ ప్రభుత్వ మూలంబునకు నలువొందు వర విమానంబులకును

జయ మంగళం నిత్య శుభ మంగళం జయ మంగళం నిత్య శుభ మంగళం

అరయ తరిగొండ నరహరి యగుచు నందరికి వరములొసగే శ్రీనివాసునకును

మురియుచును విశ్వతోముఖునిట్లు భరియించి సిరుల వెలయుచునుండు శేషాద్రికి

జయ మంగళం నిత్య శుభ మంగళం

జయ మంగళం నిత్య శుభ మంగళం

జయ మంగళం నిత్య శుభ మంగళం



www.telugulyrics.org